బాధ......

సుత్తితో తలమీద బాదుతున్నట్లు...

ఏదో పురుగు మెదడును తొలిచేస్తున్నట్లు...

బాధ...

భరించటం తనకి అలవికావటం లేదు.

తలని గోడకేసి బాదుకోవాలనిపిస్తోంది.

ఈ బాధ తీరేదెలా?

ఈ నొప్పి తగ్గేదెలా?

ఏమిటి తనకీ శిక్ష?

ఒకటి రెండు రోజులు కాదు. ఈ పోయేకాలం తనకి వాన్నాళ్లు నుంచి ఉంది. కాకపోతే అప్పట్లో అరుదుగా వస్తుండేది. కానీ ఇప్పుడేమో తరచూ రావటం మొదలు పెట్టింది.

సూదులుతో పొడుస్తూన్నట్లు బాధ మరింత అధికమైంది.

ఆ తలనొప్పిని తట్టుకోలేక అనంత్ విలవిల లాడుతున్నాడు.

డాక్టర్‌ని సం(ప్రదించకపోతే లాభం లేనట్లుంది అనుకుని అతడు మంచమ్మీద నుంచి లేచి చెప్పుల్లో కాలు దూర్చటానికి ఆయత్తమయ్యాడు.

ఆశ్చర్యం...

చూస్తూండగానే చెప్పులు అదృశ్యమైపోతున్నాయి. మట్టూ చీకట్లు కమ్ముకుంటున్నాయి. లోపల ఏదో అవుతూంది. తనని విస్మృత్తువ ఏదో ఆవహిస్తుంది. పడిపోతున్నాడు... తను పడిపోతున్నాడు......

కళ్లు బైర్లు కమ్మటంతో కుప్పకూలిపోయాడు అనంత్.

కాసేపటికి మెలకువ వచ్చినట్లయింది. తలంతా భారంగా ఉంది.

అతడు మెల్లగా లేచి కాస్త ఓపిక తెచ్చుకుని డాక్టర్ దగ్గరకి పయనమయ్యాడు. డాక్టర్ ఎన్నో ప్రశ్నలు వేస్తుంటే వాటికి సమాధానాలు చెబుతూ విస్తుపోయాడు అనంత్. చిన్న తలనొప్పిని అదేదో పెద్ద వ్యాధిలా ట్రీట్ చేస్తూన్న డాక్టర్‌ని చూసి విరాకు అనిపించింది అతనికి.

"సారీసర్! మీరు చెప్పిన లక్షణాలు చూస్తూంటే కాస్త అనుమానంగా ఉంది. స్కేన్ చేయటం అవసరం అనిపిస్తూంది. మీరు న్యూరోసర్జన్‌ని కలవటం మంచిది."

డాక్టర్ అలా అనేసరికి అదిరిపోయాడు అనంత్.

ఛ... ఛ... ఈ డాక్టర్లే అంత. వీళ్ల దగ్గరకు రావడమంటే అందుకే భయం వేస్తూంది. గోరంతల్ని కొండంతలు చేసి పేషెంట్‌ని పీడిస్తూ సొమ్ము చేసుకుంటారు.

ఫీజు చెల్లించి బయటకు నడిచాడు అనంత్.

'మీరు అశ్రద్ధ చేయటం మంచిది కాదు' వెళ్లిపోతూంటే డాక్టర్ మాటలు వినిపించినాయి వెనుక.

నరకాన్ని చవిచూపించే తలబాధని తల్చుకుంటూ, డాక్టర్ మాటల్ని మననం చేసుకోసాగాడు అనంత్. డాక్టర్ అంతగా చెబుతున్నప్పుడు కాదని కొట్టి పారేయటం మూర్ఖత్వమేమో అనిపించింది.

అపాయింట్‌మెంట్ తీసుకుని న్యూరోసర్జన్‌ని కలిశాడు.

# మృత్యుసమరం

## — కాండ్రేగుల శ్రీనివాసరావు





ఈ వారం శృంగారకథ



ఆయన కూడా మొదటి డాక్టర్ లాగే రకరకాల ప్రశ్నలు వేసి చివరికి స్కానింగ్ కన్‌ఫరమ్ చేస్తూ, డేట్ ఇవ్వటం జరిగింది.

ఆ రోజు...

అనంత్‌ని ఆధునిక పరికరాలున్న ఎయిర్ కండిషన్డ్ గదిలోనికి తీసుకువెళ్లి ఎత్తయిన బెడ్ మీద పరుండబెట్టి, కళ్లు మూసుకోమని చెప్పి డాక్టర్ స్కాన్ చేయటం మొదలుపెట్టారు.

పోర్టబుల్ టి.వి. లాంటి ఆ పరికరంలో ఓ వైపున అనంత్ పేరు, వయసు, డిసీజ్ మొదలైనవన్నీ అక్షరరూపంలో కంపోజ్ చేశారాయన.

తరువాత పిక్చర్ ట్యూబ్‌లో మెదడు స్వరూపం ప్రత్యక్షమైంది. దానిని రకరకాల కోణం నుంచి చూస్తూ, శోధించసాగారాయన. అనుమానం కలిగిన సందర్భాలలో దానికి అమర్చి ఉన్న కెమేరాతో ఫోటోలు తీయసాగారు. ఆరు ఏడు ఫోటోలు తీశాక పరిస్థితి అర్థమవటంతో, బెడ్ మీద కళ్లు మూసుకుని ఉన్న అనంత్ వైపు సానుభూతిగా చూస్తూ ఉండిపోయారాయన.

'మిస్టర్ అనంత్! పేషెంట్ కండిషన్ ఎంత ప్రమాదకరమైనప్పటికీ ఆ స్థితిని అతడితో చెప్పటం భావ్యం కాదంటారు. కానీ కొన్ని పరిస్థితులలో చెప్పక తప్పదు. మీకు... మీకు... అయామ్ సారీ... ఎలా చెప్పాలో తెలియటం లేదు. మీకు బ్రెయిట్ ట్యూమర్ ఉంది'.

అనంత్‌కి తాను విన్నదేమిటో అంతుచిక్కటం లేదు.

ఆ వాస్తవాన్ని జీర్ణం చేసుకోలేకపోతున్నాడు.

'ఈ భూమ్మీద మీకున్న చివరి రోజుల్నీ, ఆనందంగా ప్రశాంతంగా గడపటానికి ప్రయత్నించండి.'

అంటే... మైగాడ్... తనకి మృత్యువు తథ్యం అన్నమాట!

'డా...క్ట...ర్... దీనికి... దీనికి... మందు లేదా?' గొంతు బొంగురుపోయింది.

'ఒక విధంగా లేదనే చెప్పాలి. ఏ కాస్త, ఉన్నవయినా తీవ్రత చేయకుండా ఉంచగలవే గానీ పూర్తిగా నయం చేయటానికి ఉపయోగపడవు.'

అనంత్‌కి దుఃఖం ఉప్పెనలా ముంచుకొచ్చింది.

చేతులలో ముఖం దాచుకుని వెక్కివెక్కి ఏడ్వసాగాడు.

★ ★ ★

జీవితం బుద్బుత ప్రాయమే కావచ్చు. మానవ మనుగడకి మృత్యువు ఒక పరిపూర్ణత కావచ్చు. కానీ దానిని ఆహ్వానించగలగడం ఎందరికి సాధ్యం?

తనకి బ్రెయిన్ ట్యూమర్ అని తెలిసిన దగ్గర్నుంచి అనంత్‌కి కంటి మీద కునుకు లేదు. నిద్రపోతే అదే శాశ్వత నిద్రమౌనన్న భయమే అతడికి నిద్రను దూరం చేస్తోంది.

అనుక్షణం మరణయాతన.

రేపుని తను చూడగలడా అన్న నరకయాతన.

సందర్శించవలసిన దేవాలయాల్నీ, చూడవలసిన ప్రాంతాల్నీ నిర్లిప్తంగా చూస్తున్నాడు. ఆ అందాలన్నింటికీ తను అతీతుడౌతున్నాడన్న వాస్తవం అతడ్ని రోజురోజుకీ కృంగదీస్తూనే ఉంది.

ఏ అర్ధరాత్రో లేచి గంటలు తరబడి వెక్కివెక్కి ఏడ్చేవాడు. హై టెంపరేచర్ ఫీవర్‌తో మలమూత్రాల్ని మంచమ్మీద విసర్జిస్తూ ఓ ఉన్మాదిలా తయారవసాగాడు.

ఆ పరిస్థితులలోనే అతడికి ఆత్మీయులంతా గుర్తొచ్చారు. వాళ్ల అందర్లో మొదటివాడు బాబులు.

బాబులు గుర్తుకురాగానే అనంత్‌కి కాస్త ఊరట కలిగింది. ఆరిపోతున్న అతడి కళ్లలో అపరంజి వెలుగులు విరజిమ్మాయి.

ఎందుకంటే మృత్యువాగ్నికి బాబులు కూడా ఒక సమిధే కాబట్టి.

★ ★ ★

బాబులు ఎక్కువగా చదువుకోలేదు.

చిన్నతనంలోనే అమ్మానాన్నలు మరణించటం వలన ఏకాకి అయ్యాడు.

లోకల్ ట్రైన్‌లో వేరు శనక్కాయలు అమ్ముతూ వచ్చిన డబ్బుల్తో పొట్ట పోషించుకునేవాడు.

ఓ రోజున కంపార్ట్‌మెంట్ నుంచి మరొక కంపార్ట్‌మెంట్ మారుతున్న సమయంలో దురదృష్టం అతడ్ని కాటేసింది.

పట్టు తప్పి చక్రాలు క్రిందకి జారపోయాడు. తొడభాగం వరకూ అతడి రెండు కాళ్లు ముక్కలైపోయాయి.

రక్తం ధారాపాతంగా స్రవిస్తూంటే అతడు స్పృహ కోల్పోయాడు.

మిగతా చిల్లర వ్యాపారస్తులు చైన్‌లాగి ట్రైన్ ఆపి బాబుల్ని తీసి హాస్పటల్‌లో జాయిన్ చేశారు.

డాక్టర్ల కృషి వలన ఎలాగో బ్రతికి బట్టకట్టాడు బాబులు.

బెడ్‌మీద ఉన్న అన్నిరోజులూ తన అవిటితనాన్ని అధిగమించేందుకు అవసరమయ్యే ఆత్మస్థయిర్యాన్ని పెంపొందించుకునేవాడు.

హాస్పటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యేసరికి చెక్కపీటల మీద దేక్కుంటూ ఒకచోట నుంచి వేరొక చోటకి వెళ్లటం నేర్చుకున్నాడు. మొదట్లో చేతులు తీవ్రంగా నొప్పి పెడుతున్న క్రమంగా అలవాటు అవసాగింది.

ఆ తరువాత అతడికి ఉత్పన్నమైన ప్రశ్న బ్రతుకుతెరువు?

ఏదో ఒహటి చేద్దామంటే పాత రోజులులా తిరగటానికి తనకి కాళ్లు లేవు. కనుక ఒక చోట ఉండేలాంటి వ్యాపకమేదైనా కావాలి. అదీ చేతులతో చేయవలసిన పని అయి ఉండి సీజనుతో నిమిత్తం లేకుండా ప్రతీరోజూ అంతో ఇంతో డబ్బులు సంపాదించుకునేలాంటి వృత్తిని అతడు స్వీకరించాడు.

పెట్రోలు బంకు దగ్గర ఇద్దరు కుర్రవాళ్ల సహాయంతో టైర్లుకి పాక్చర్స్ వేయడానికి వృత్తిగా స్వీకరించాడు. రోజుకి పదిహేను నుంచి పాతిక రూపాయిలుదాకా సంపాదించేవాడు.

ఆ విధంగా రోజుల్ని ఎలాగో ఒకలా నెట్టుకొస్తున్నాడనుకునే తరుణంలో మృత్యువు తన ప్రతాపాన్ని బాబులు మీద మరొకసారి చూపించింది.

ఆ రోజు...

బాబులు భోజనానికని హోటల్ వైపు వెళ్తాండగా, ఎదర వేగంగా వస్తూన్న లారీ నుంచి వెనుక చక్రం వేరుపడి చెక్కపీటలు మీద దేక్కుంటూవస్తూన్న బాబుల్ని 'ఢీ'కొంది.

తీవ్రమైన గాయాలుతో బాబులు మళ్లీ హాస్పటల్ పాలయ్యాడు.

### నా భర్త

"మీ ధైర్యం మెచ్చుకోదగినది, దొంగను చావచితగ్గొట్టారు అదీ చీకటిలో" పొగిడాడు లాయర్ అన్నపూర్ణమ్మను.

"నన్ను మరీ పొగడకండి వాడు దొంగ అని నాకేం తెలుసు. సారాత్రాగి వాస్తే నా భర్త అని అనుకొన్నాను" అంది అన్నపూర్ణ.

— బిలకంటి రత్నబాబూరావు,
మల్దకల్.

కొన్నిరోజులు మళ్లీ మృత్యువుతో పోరాటం.

ఆ తరువాత క్రమంగా కోలుకుని మళ్లీ తన వృత్తిని కొనసాగించసాగాడు బాబులు. మనిషి మానసికంగానైనా శారీరకంగానైనా ఒక్కసారే చావాలి.

కానీ అనుక్షణం అనునిత్యం చస్తూ బ్రతుకుతూంటే ఆ బాధని భరించటం ఎంత కష్టతరం?

మృత్యువుకి బాబులు మీద కసి తీరలేదు కాబోలు. మళ్లీ మరోసారి విజృంభించింది. ఓ రాత్రిపూట టైరుకి పంక్చర్ వేస్తూన్నాడు బాబులు.

ప్రక్కనే ప్రమాదం పొంచి ఉందన్న సంగతి ఆ అభాగ్యుడికి తెలియలేదు.

వెలుగు కోసమని పెట్టుకున్న పెట్రోమాక్సు లైటు బరస్ట్ అయింది.

విస్ఫోటంతో పాక అంటుకుంది.

షాక్ నుంచి తేరుకున్న వారు జరిగింది గ్రహించి వెంటనే తలోదిక్కూ పరుగుతీశారు. గ్రహించగలిగినా, పారిపోలేనివాడు బాబులు ఒక్కడే!

మృత్యువాగ్నికి అతడి శరీరం ఆహుతి అయింది.

అతడి వళ్లంతా తీవ్రంగా కాలిపోయింది. కాలిన శరీరం మీద అక్కడక్కడ టెర్లిన్ దుస్తులు అతుక్కుపోయాయి. కొన్ని చోట్ల ఎర్రటి కండ బయటపడి వాటి నుంచి జిగురులాంటి ద్రవం చిమ్మసాగింది.

బాధను అణుచుకోలేక బాబులు పెట్టిన గావుకేకలు ఎలాంటి పాషాణాన్నైనా కరిగించకమానవు.

మళ్లీ బాబులు ఆస్పత్రి పాలయ్యాడు.

శరీరం అరవైశాతం కాలటం వలన డాక్టర్లు చెప్పలేమని పెదవి విరిచేశారు.

మృత్యుసమరంలో ఈసారి కూడా బాబులే నెగ్గాడు.

పన్నెండు రోజులు కోమాలో ఉన్న బాబులు పదమూడవ రోజున కన్ను తెరచి లోకాన్ని చూడగలిగాడు.

మూడు నెలలు హాస్పటల్‌లో మంచమ్మీద ఉన్నాక బాబులుకి డిశ్చార్జ్ లభించింది.

హృదయవిదారకమైన సంఘటనలు ఇన్ని జరిగాక కూడా బాబులు పెదవుల మీద చిరునవ్వు చెక్కుచెదర్లేదు.

అతడి ఆత్మస్థైర్యం రవ్వంత కూడా తగ్గలేదు.

### భక్తుడు

"నీ కాబోయే భర్త ఎలా వుండాలని కోరుకుంటావే" కాలేజీలో సుజాత సుప్రజను అడిగింది.

"నాకేమో రాముడిలాగా ఉండాలి. మిగతా వాళ్లకి రాముడి భక్తుడిలాగా కనిపించాలి" చెప్పింది సుప్రజ.

— జంధ్యాల భారతి.

జీవితంలో తిన్న ఎదురుదెబ్బలకి ప్రతీకలుగా కాళ్లూ కాలిన గాయాలు తప్పా నిరాశ నిస్పృహోయత నైరాశ్యం లాంటివేవీ అతడిలో కాగడా వెతికినా కానరావు.

కొందరి అనుభవాలు ఇంకొందర్ని ప్రభావితం చేస్తాయి అనటానికి ఇంతకంటే నిదర్శనం ఏం ఉంటుంది.

బాబులు పెదవులపై జాలువారే చిరునవ్వు అనంత్‌లాంటి అనంతజీవులకు స్ఫూర్తినిస్తుంది.

బాబులుతో పోల్చుకుంటే అనంత్‌కి తన సమస్య చిన్నదనిపించింది.

అతడ్ని చూడాలనీ తన కష్టాల్ని అతడితో పంచుకోవాలనీ గంటలు తరబడి అతడి సమక్షంలో గడపాలనీ అనిపించింది అనంత్‌కి.

వెంటనే పయనమయ్యాడు.

★ ★ ★

అనంత్‌ని చూసి బాబులు చాటేసుకున్నంత పనిచేశాడు.

పనిమానేసి అనంత్‌తో కబుర్లాడుతూ కాలాన్ని కరిగిస్తూన్నాడు.

ఇద్దరుమిత్రులూ చాలా కాలానికి కలుసుకోవటం వల్ల పరిసరాలు మరిచి స్నేహామృతాన్ని చవిచూస్తున్నారు.

సరిగ్గా ఆ సమయాన అప్పుడు జరిగిందా సంఘటన.

మొదట హాహాకారాలు వినిపించినాయి.

అటుచూసి మిత్రులు ఇద్దరూ హతాశులయ్యారు.

పెట్రోలు బంకు దగ్గర ఎవరో డ్రైవర్ సిగరెట్ కాల్చి అగ్గిపుల్లను అక్కడే పడేశాడట! నేల పెట్రోలు డీజల్ ఆయిల్‌తో తడిసి ఉండటం వలన నిప్పు క్షణంలో అంటుకుంది.

దానిని సకాలంలో ఆర్పగలిగితే పర్లేదు. లేదా నేల అడుగుభాగంలో ఉన్న టాంకుకి నిప్పు చేరిందంటే అక్కడో పెద్ద విస్ఫోటం జరగక తప్పదు.

మంటలు మరింత విస్తృతమవటంతో చుట్టుప్రక్కల వాళ్ళంతా ప్రాణరక్షణ కోసం పరుగులు తీయసాగారు. కొందరు డ్రైవర్లయితే వెంటనే తమ వాహనాలు ఎక్కేసి అమిత వేగంతో నిష్క్రమించసాగారు.

ధైర్యస్థులు కొందరు మాత్రం అగ్నిమాపక సాధనాలుతో మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.

సంగతి గ్రహించిన బాబులు క్షణం కూడా ఆలస్యం చేయకుండా తన చెక్కపీటలను వడివడిగా మార్చుకుంటూ దూరంగా పారిపోవటానికి ప్రయత్నం చేస్తూన్నాడు.

'అనంత్! పారిపో... ప్రమాదం జరగపోతోంది. బంకు అంటుకుంది. తక్షణం పారిపో...' అంటూ అనంత్‌ని హెచ్చరిస్తూ వేగంగా దేక్కుంటూ ఆ ప్రాంతం నుంచి నిష్క్రమించటానికి ప్రయత్నిస్తూన్నాడు బాబులు.

అనంత్ కదల్లేదు.

శిలాప్రతిమలా కూర్చునే ఉన్నాడు.

జవీతంలో ఎన్నో ఎదురుదెబ్బలు తిన్న బాబులుకి ఇంకా బ్రతుకు మీద ఆశ ఉండటం అతడ్ని చకితుడ్ని చేస్తూంది.

చిన్న చిన్న సంఘటనలే మనుష్యుల మీద పెద్ద పెద్ద ప్రభావాలు చూపిస్తాయి. అతి సామాన్యమైన ఆ సంఘటన అనంత్‌కి ఓ పెద్ద జీవితసత్యాన్ని తెలియజేసింది.

మనిషిగా జన్మనెత్తినందుకు బ్రతకటానికి పోరాటం తప్పదు. ఆ ప్రయత్నమూ తప్పు కాదు. తరచి చూడాలేకానీ చావు పొరుగునే జీవన ఆరాటాలు ఎన్నో కనిపించకమానవు.

మృత్యువు రథచక్రాల క్రింద బ్రతుకు పెనుగులాట జీవికి తప్పదు మరి!

అనంత్ క్షణం కూడా వృధా చేయకుండా ప్రాణరక్షణకై పరుగుతీశాడు.